నిబంధనాల సర్దుబాటు

పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులను సర్దుబాటు (అడ్జస్ట్‌మెంట్) చేసే ప్రక్రియను ఇటీవల ప్రభుత్వం చేపట్టింది. విద్యా శాఖ నిబంధనల ప్రకారం 3 ఆపై తరగతులు బోధిస్తున్న స్కూళ్లకు సబ్జెక్టు టీచర్లు ఉండాలి. కానీ అదేమీ పట్టించుకోకుండా నిబంధనలకు పాతరేస్తూ కూటమి ప్రభుత్వం ఇష్టానుసారంగా టీచర్లను సర్దుబాటు చేసింది. దాంతో ప్రత్తిపాడు మండలం తుమ్మలపాలెంలోని అప్పర్ ప్రైమరీ స్కూల్‌లో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.



సబ్జెక్టు టీచర్ లేకపోవడంతో ఇంగ్లీష్ పాఠాలు బోధిస్తున్న ఎస్‌జీటీ మీనాకుమారి

- తుమ్మపాలెం యూపీ పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థుల అగచాట్లు
- ఎస్‌ఏలు లేక ఎస్‌జీటీలతో సబ్జెక్టుల బోధన
- ఎస్‌ఏలను నియమించకుండా చోద్యం
- తెలుగు, హిందీ భాషలు బోధించే వారూ కరువు

ప్రత్తిపాడు: విద్యా శాఖ నిర్ణయాలు అటు ఉపాధ్యాయులను, ఇటు విద్యార్థులను అగచాట్లకు గురిచేస్తున్నాయి. పేరుకు యూపీ పాఠశాల అయినా సబ్జెక్టులు బోధించే టీచర్లు కరువయ్యారు. ఎస్‌జీటీలే సబ్జెక్టులను కూడా బోధించాల్సిన దుస్థితి చోటుచేసుకుంది. పిల్లలు ఫుల్‌గా ఉన్నా, ఉపాధ్యాయులు సరిపడినంత మంది లేకపోవడంతో గత్యంతరం లేక ప్రైవేట్ వ్యక్తులను ఏర్పాటు చేసుకుని విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధిస్తున్నారు. వర్క్ అడ్జస్ట్‌మెంట్‌లో అయినా తమ పాఠశాలకు న్యాయం జరుగుతుందని ఆశించినప్పటికీ, భంగపాటు తప్పలేదు. నిబంధనల పేరుతో ఉన్న ఎస్‌ఏను పక్క మండలానికి పంపి, ఎస్‌జీటీని ఈ పాఠశాలకు అడ్జస్ట్ చేయడంతో విద్యార్థులు, టీచర్స్ బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయి.

యూపీ పాఠశాలలో పరిస్థితి ఇలా...

వివరాల్లోకి వెళితే ప్రత్తిపాడు మండలం తుమ్మలపాలెంలోని అప్పర్ ప్రైమరీ (యూపీ) పాఠశాలలో 1వ తరగతిలో 4, 2వ తరగతిలో 1, 3వ తరగతిలో 10, 4వ తరగతిలో 10, 5వ తరగతిలో 16, 6వ తరగతిలో 16, 7వ తరగతిలో 12, 8వ తరగతిలో18 మంది చొప్పున మొత్తం 87 మంది విద్యార్థులున్నారు. వీరికి గాను పాఠశాలలో పాఠ్యాంశాలు బోధించేందుకు ఒక సెకండరీ గ్రేడ్ టీచర్ (ఎస్‌జీటీ), నలుగురు స్కూల్ అసిస్టెంట్ (ఎస్‌ఏ)లను తొలుత కేటాయించారు.



హెచ్‌ఎం ప్రత్తిపాడు వెళ్లడంతో తరగతి గదుల్లో ఉపాధ్యాయులు లేక ఖాళీగా కూర్చున్న విద్యార్థులు

- ఎస్‌జీటీలు ఒకటి, రెండు తరగతులకు, ఎస్‌ఏలు 3 నుంచి 8 తరగతుల విద్యార్థులకు ఆయా సబ్జెక్టుల వారీగా బోధించాల్సి ఉంది. కానీ ఇటీవల జరిగిన వర్క్ అడ్జస్ట్‌మెంట్‌లో ఇక్కడ పనిచేస్తున్న స్కూల్ అసిస్టెంట్లలో ఇంగ్లీష్ ఉపాధ్యాయుడిని గుంటూరు నగరానికి అడ్జస్ట్ చేసి, ఆయన స్థానంలో

ఎస్‌జీటీతో ఇంగ్లీష్ సబ్జెక్ట్ బోధన

ఇంగ్లీష్ పాఠాలు బోధించేందుకు పాఠశాలలో ఎస్‌ఏలు లేకపోవడంతో వర్క్ అడ్జస్ట్‌మెంట్‌పై వచ్చిన ఎస్‌జీటీ మీనాకుమారికి ఇంగ్లీష్ బోధన బాధ్యతలు అప్పగించారు. ఆమెకు సబ్జెక్టుపై అంతగా పట్టులేనప్పటికీ ఇంటి వద్ద నేర్చుకుని విద్యార్థులకు పాఠ్యాంశాలను బోధిస్తున్నారు. మొత్తమ్మీద ముగ్గురు ఉపాధ్యాయులు మాత్రమే ప్రస్తుతం పాఠశాలలో ఉన్నారు. వీరిలోనూ ఎవరికైనా శిక్షణలు, సమావేశాలు ఉంటే ఇద్దరు ఉపాధ్యాయులే ఎనిమిది తరగతులూ మ్యానేజ్ చేయాల్సిన పరిస్థితి. మంగళవారం ఎస్‌జీటీ ఉదయలక్ష్మి ఎఫ్‌ఎల్‌ఎన్ శిక్షణకు వెళ్లగా, హెచ్‌ఎం ముక్కంటి ప్రశ్నపత్రాలు తీసుకువచ్చేందుకు ప్రత్తిపాడుకు వెళ్లారు. దీంతో ఒక్క టీచరే పాఠశాలకు దిక్కయ్యారు. ఉపాధ్యాయుల్లేని తరగతి గదుల్లో విద్యార్థులే చదువుకుంటూ కనిపించారు. సమస్యను పరిష్కరించాలంటూ విద్యార్థుల తల్లిదండ్రులు, అధికారులు, ఎమ్మెల్యే చుట్టూ తిరిగినా ఫలితం లేకపోయిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

ముతబడిన నిమ్మగడ్డవారిపాలెం ప్రైమరీ స్కూల్ ఎస్‌జీటీని ఇక్కడకు పంపారు. కాగా మిగిలిన సోషల్ టీచర్ నవంబర్‌లో రిటైర్ అవ్వగా, లెక్కల మాస్టారు జాండిస్‌తో బాధ పడుతూ కొద్దిరోజులుగా సెలవులో ఉన్నారు. ఇక మిగిలింది సైన్స్ ఉపాధ్యాయుడు మాత్రమే. వాస్తవానికి సైన్స్ కూడా పీఎస్, ఎన్‌ఎస్‌లకు వేర్వేరుగా ఉపాధ్యాయులుండాల్సి ఉన్నప్పటికీ ఒక్కరే అడ్జస్ట్ అవుతున్నారు. కాగా తెలుగు, హిందీ సబ్జెక్టులు బోధించేందుకు అసలు ఉపాధ్యాయులే లేని పరిస్థితి.

ఒత్తిడితో అల్లాడుతున్నాం



సబ్జెక్టు టీచర్లు లేకపోవడంతో తీవ్రమైన ఒత్తిడి మాపై పడుతుంది. అయినప్పటికీ అడ్జస్ట్ చేసుకుని విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా పాఠాలు సబ్జెక్టుల వారీగా చెబుతున్నాం. తెలుగు, ఇంగ్లీష్ చెప్పేవారు లేదు. ఉన్నతాధికారులు స్కూల్ అసిస్టెంట్లను నియమిస్తే మరింత మెరుగ్గా బోధిస్తాం.

– వి.సి.హెచ్.ముక్కంటి, హెచ్‌ఎం, యూపీ స్కూల్, తుమ్మలపాలెం

ఇంటి వద్ద ప్రాక్టీసు చేసుకుంటున్నా



నేను ఎస్‌జీటీని. నేను సబ్జెక్టు టీచర్‌ను కాదు. కానీ ఎస్‌ఏలు లేకపోవడంతో ఇంగ్లీష్ బోధించాలని నాకు చెప్పారు. చేసేదేమీ లేక రాత్రి పదకొండు.. పన్నెండు గంటల వరకు ఇంటి వద్ద ఇంగ్లీష్ ప్రాక్టీసు చేసుకుని, మర్నాడు స్కూల్‌కు వచ్చి పిల్లలకు పాఠాలు చెబుతున్నా. సబ్జెక్టు టీచర్లను కేటాయిస్తే బాగుంటుంది.

– మీనాకుమారి, ఎస్‌జీటీ, యూపీ స్కూల్, తుమ్మలపాలెం

విద్యార్థులు గైర్హాజరవ్వకుండా చూడండి

సమగ్ర శిక్ష ఏపీసీ విజయలక్ష్మి

ప్రత్తిపాడు: విద్యార్థులు పాఠశాలలకు గైర్హాజరవ్వకుండా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సమగ్ర శిక్ష ఏపీసీ జి.విజయలక్ష్మి అన్నారు. మండల పరిధిలోని వంగిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను బుధవారం తనిఖీ చేశారు. అనంతరం పాఠశాలకు విద్యార్థులు క్రమం తప్పకుండా వచ్చేలా చూడాలని, గైర్హాజరయ్యే విద్యార్థుల తల్లిదండ్రులకు ఫోన్ చేసి కారణాలు అడిగి తెలుసుకోవాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. తొలుత స్థానిక బీఎఫ్‌ఎస్ ప్రాథమిక పాఠశాలను పరిశీలించారు. పాఠశాల పూర్తిగా శిథిలావస్థకు చేరిందని తల్లిదండ్రుల నుంచి ఫిర్యాదులు అందడంతో పాఠశాలను పరిశీలించారు. పాఠశాలను కూల్చి, ఆ స్థానంలో నూతన భవనం కట్టేందుకు ఎంత ఖర్చు అవుతుందన్న అంచనాలను తయారు చేసి తమకు పంపాలని ఇంజినీరింగ్ అసిస్టెంట్‌తో పాటు ఇన్‌చార్జి హెచ్‌ఎం అన్నపూర్ణకు ఆదేశాలు జారీ చేశారు. వెంట ఎంఈఓ రమాదేవి ఉన్నారు.



మధ్యాహ్న భోజనం చేస్తున్న ఏపీసీ విజయలక్ష్మి, ఎంఈఓ రమాదేవి

ఫలసాయం అనుభవించేందుకే ఆలయ భూములు కేటాయించాం

ఆర్డీఓ శ్రీనివాసరావు

పెదకాకాని: దేవదాయశాఖకు చెందిన భూముల నుంచి వచ్చే ఫలసాయం మాత్రమే అనుభవించే హక్కు కల్పించడం జరిగిందని గుంటూరు ఆర్డీఓ కె.శ్రీనివాసరావు అన్నారు. పెదకాకాని సచివాలయం వద్ద బుధవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక(రెవెన్యూ సదస్సు) నిర్వహించారు. గ్రామంలో 18,19 తేదీలలో నిర్వహించనున్న సదస్సుకు రెవెన్యూ డివిజనల్ అధికారి కె.శ్రీనివాసరావు హాజరయ్యారు. దేవదాయశాఖ భూములకు సంబంధించి అనుభవదారులు అమ్ముకునే హక్కు కల్పించాలని అర్జీలు ఇవ్వడం జరిగింది. ఆర్డీఓ మాట్లాడుతూ దేవాలయాలలో పలు రకాల సేవలు చేసే వారికి ప్రభుత్వం భుక్తి కొరకు భూములు కేటాయించడం జరిగిందన్నారు. ఆ భూమిలో పంటలు పండించడంతో పాటు కాపాడాల్సిన బాధ్యత కూడా వారిపైనే ఉందన్నారు. పంట సాగు చేయగా వచ్చే ఫలసాయాన్ని మాత్రమే అనుభవించాలని ఆ భూములు అమ్మే హక్కు ఎవరికీ లేదని వివరించారు. గ్రామానికి చెందిన ప్రజలు భూ సమస్యలపై పలు అర్జీలు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణకాంత్, డెప్యూటీ తహసీల్దార్ ప్రసాద్, దేవదాయశాఖ గ్రూపు టెంపుల్స్ ఈఓ కృష్ణంరాజు, సర్వేయర్ వీరాంజనేయులు, ఆర్‌ఐ శశాంక్ పాల్గొన్నారు.



పెదకాకాని సదస్సులో పాల్గొన్న ఆర్డీఓ శ్రీనివాసరావు

త్రిముఖ వ్యూహాన్ని అనుసరించాలి

అపారి ప్రాజెక్ట్ మేనేజర్ డాక్టర్ కేఎస్ వరప్రసాద్



చేబ్రోలు: నాణ్యత, భద్రత, ప్రపంచ మార్కెట్‌లో సులభ వాణిజ్యం అనే త్రిముఖ వ్యూహాన్ని మనం కూడా అనుసరించాలని ఐకార్ – ఐఐఓఆర్ మాజీ డైరెక్టర్, అపారి ప్రాజెక్ట్ మేనేజర్ కేఎస్ వరప్రసాద్ అన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో 'ప్లాంట్ హెల్త్ ఇన్ ఆసియా: రీసెర్చ్ ప్రయారిటీస్ అండ్ పార్ట్‌నర్‌షిప్స్'' అనే అంశంపై రెండు రోజుల పాటు నిర్వహించిన ఇంటర్నేషనల్ సదస్సు బుధవారం ముగిసింది. వరప్రసాద్ మాట్లాడుతూ బంగ్లాదేశ్‌లో ఎస్‌పీఎస్(శానిటరీ, ఫైటోశానిటరీ) అనేవి వ్యవసాయ ఉత్పత్తులు, ఆహార ఉత్పత్తుల ఆరోగ్యభద్రతను కాపాడటానికి, పర్యావరణ పరిరక్షణకు రూపొందించబడ్డ నిబంధనలని తెలియజేశారు. ఈ విధానాలు అంతర్జాతీయ వాణిజ్యంతో సంబంధం కలిగి ఉంటాయన్నారు. ఇటలీలోని ఐఐపీపీసీ సెక్రటరియట్, ఎఫ్‌ఏఓ ఇంప్లిమెంటేషన్ అండ్ ఫెసిలిటేషన్ లీడ్ డాక్టర్ సారా బ్రునెల్ మాట్లాడుతూ మొక్కల ఆరోగ్యం అనేది వ్యవసాయం సుస్థిరత, పర్యావరణ పరిరక్షణ, ఆహార భద్రతకు సంబంధించిన ఒక కీలక అంశమన్నారు. ప్రపంచవ్యాప్తంగా మొక్కల వ్యాధులు, కీటకాలు, ఇతర ఆపత్కాల సమస్యలు వ్యవసాయ రంగాన్ని కఠినంగా ప్రభావితం చేస్తూ ఉంటాయన్నారు. సౌత్ ఏసియా సీఏబీఐ ఇంటర్నేషనల్ రీజనల్ డైరెక్టర్ డాక్టర్ వినోద్ పండిట్ మాట్లాడుతూ ఎస్‌పీఎస్ ప్రమాణాలను అనుసరించడం కేవలం వ్యాపార ప్రోత్సాహానికి మాత్రమే కాకుండా ప్రజల ఆరోగ్య రక్షణకు కూడా కీలకంగా ఉంటాయన్నారు. ఐదు జిల్లాలకు చెందిన 145 మంది రైతులతో రైతునేస్తం చైర్మన్ డాక్టర్ వై.వెంకటేశ్వరరావు ప్యానెల్ డిస్కషన్ నిర్వహించారు. విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ లావు రత్తయ్య, వైస్ చాన్స్‌లర్ పి.నాగభూషణ్ తదితరులు పాల్గొన్నారు.

జననేత జగనన్న జన్మదిన వేడుకలకు ఆహ్వానం

గుంటూరు రూరల్: ఈనెల 21వ తేదీన జననేత, వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను నగర శివారుల్లోని ఏటుకూరు బైపాస్‌లోని నియోజకవర్గ కార్యాలయంలో ఘనంగా నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ

మెగా రక్తదాన శిబిరం

సందర్భంగా మెగా రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రత్తిపాడు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

ఉద్యోగులు విధుల్లో నిర్లక్ష్యం వద్దు

- జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి
- మన్నవలో రెవెన్యూ సదస్సు

పొన్నూరు: ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను మొక్కుబడిగా నిర్వహించవద్దని, రెవెన్యూ సమస్యలపై ప్రజల నుంచి స్వీకరించే ప్రతి అర్జీకి సంతృప్తికర పరిష్కారాన్ని అధికారులు చూపాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి పేర్కొన్నారు. మండలంలోని మన్నవలో తహసీల్దార్ మహమ్మద్ జియావుల్ హక్ అధ్యక్షతన రెవెన్యూ సదస్సు బుధవారం నిర్వహించారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ప్రజల అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి, పరిష్కారం దిశగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. భూ సమస్యలపై ప్రజల సందేహాలకు సమాధానం చెప్పలేని స్థితిలో ఉన్న రెవెన్యూ అధికారుల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. తొలుత కార్యాలయంలోని రెవెన్యూ భూ రికార్డులను సరిచూసుకుంటే సదస్సులో అర్జీలకు సత్వర పరిష్కారం లభిస్తుందని అన్నారు. ఇలా పనిచేస్తే సదస్సుల లక్ష్యం నెరవేరదని, పనితీరు మార్చుకోవాలని అధికారులను మందలించారు. రీసర్వే, అడంగల్‌లో మార్పులు, చేర్పులు, సర్వే నంబర్లు సరిచేయడం, ఆర్‌ఎస్‌ఆర్ రికార్డులు, భూమి కొనుగోలు అనంతరం పేర్ల మార్పిడి, ఆక్రమణలు, నిషేధిత భూముల జాబితా నుంచి తొలగించిన వాటి వివరాల వంటి 56 సర్వీసులను తెలుసుకునేందుకు ఈ సదస్సులు ఉపయోగపడతాయని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఉదయం నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించనున్న సదస్సులో గ్రామానికి సంబంధించిన భూ రికార్డులన్నీ అందుబాటులో ఉండాలని, ప్రజలకు జవాబుదారీగా అధికారులు విధులు నిర్వహించాలని అన్నారు. పలువురు అర్జీదారులు అధికారుల పనితీరుపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. తహసీల్దార్ కార్యాలయం చుట్టూ కొందరు సిబ్బంది కాళ్లరిగేలా తిప్పుతున్నారని, అర్జీలు పెట్టినా పట్టించుకోవడం వాపోయారు. వీఆర్వో పాస్ బుక్ సమస్యలపై లంచాల కోసం వేధిస్తున్నారని ఫిర్యాదు చేశారు. రైస్ మిల్లులలో ధాన్యం కొనుగోలు జరగడం లేదని, సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు రైతులు ఆమె దృష్టికి తీసుకెళ్లారు. ఈ సదస్సులో ప్రజల నుంచి మొత్తం 88 అర్జీలు స్వీకరించినట్లు తహసీల్దార్ తెలిపారు. మ్యుటేషన్లు 24, పాస్‌బుక్ రీప్లేస్ 7, ఎఫ్ లైన్ 50, అడంగల్ కరెక్షన్ 5, ఎఫ్‌ఎంసీ 1, డిజిటల్ సిగ్నేచర్ 1 వచ్చినట్లు తెలిపారు.



అర్జీలను పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

పూర్తిస్థాయిలో ధాన్యం కొనుగోలు..

కలెక్టర్ నాగలక్ష్మి విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల ప్రకారం తేమ శాతంతో పనిలేకుండా ధాన్యం కొనుగోలు జరుగుతుందని తెలిపారు. ఇప్పటి వరకు జిల్లాలో వెయ్యి టన్నుల ధాన్యం కొనుగోలు చేయడం జరిగిందని చెప్పారు. రైతుల సమస్యను పరిగణనలోకి తీసుకుని రెండు రోజుల్లో పొన్నూరులోని నిల్వ ఉన్న ధాన్యం మొత్తాన్ని కొనుగోలు చేసే విధంగా చర్యలు చేపడతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సింహ, మండల ప్రత్యేకాధికారి నరసింహారావు, ఎంఏఓ వెంకట్రామయ్య, ఎంపీడీఓ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

• ముక్కుమూసుకోవాల్సిందే..



మురుగుతో నిండి అధ్వానంగా ఉన్న పాఠశాల ద్వారం

మండల పరిధి మామిళ్లపల్లిలోని ప్రభుత్వ పాఠశాల పరసరాలు అధ్వానంగా ఉన్నాయి. పాఠశాల ద్వారంలోని మురుగు కాలువ వ్యర్థాలతో నిండి దుర్గంధం వెదజల్లుతోంది. అక్కడే చెత్త నిల్వలు పేరుకుపోయి అపరిశుభ్రత నెలకొంది. పాఠశాలకు వచ్చే విద్యార్థులు ముక్కు మూసుకుని రావాల్సిన పరిస్థితి ఏర్పడింది. పంచాయతీ అధికారులు స్పందించి పాఠశాల పరిసరాలు శుభ్రం చేయాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు. – పొన్నూరు

జీజీహెచ్‌లో అడిషనల్ డీఎంఈ సమీక్ష

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో బుధవారం అడిషనల్ డీఎంఈ డాక్టర్ వెంకటేష్, పలు వైద్య విభాధిపతులు, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణతో సమీక్ష నిర్వహించారు. ఆస్పత్రిలో నిర్మాణంలో ఉండి, ఆగిపోయిన పలు భవనాలను పూర్తి చేసేందుకు తీసుకోవాల్సిన చర్యల గురించి చర్చించారు. ఆస్పత్రిలో మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రణాళికాబద్ధంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని సూచించారు. అత్యవసర వైద్య సేవలు జాప్యం జరుగకుండా చూడాలని పేర్కొన్నారు. నిలిచిపోయిన భవన నిర్మాణాలను, పలు వైద్య విభాగాలను పరిశీలించారు.

భూ సమస్యలు త్వరితగతిన పరిష్కారం

ప్రత్తిపాడు: రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన భూ సంబంధ సమస్యలకు త్వరితగతిన పరిష్కారం చూపడం జరుగుతుందని తహసీల్దార్ జి.కరుణకుమార్ అన్నారు. మండల పరిధిలోని ఈదులపాలెంలో బుధవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. వివిధ రకాల భూ సంబంధ సమస్యలకు సంబంధించి రైతుల నుంచి అందిన అర్జీలను అధికారులు స్వీకరించారు. కార్యక్రమంలో డీటీ ధర్మతేజ పాల్గొన్నారు.

క్లుప్తంగా

కత్తెర పురుగుతో దిగుబడులపై తీవ్ర ప్రభావం



ప్రత్తిపాడు: మొక్కజొన్న పంటలో కత్తెర పురుగు ఉధృతిని నివారించకపోతే ఆ ప్రభావం దిగుబడులపై తీవ్ర స్థాయిలో పడుతుందని మండల వ్యవసాయాధికారి కె.అరుణ కుమారి అన్నారు. మండల పరిధిలోని వంగిపురంలో బుధవారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానికంగా రైతులు సాగు చేసిన మొక్కజొన్న పంటపొలాలను పరిశీలించి, కత్తెర పురుగు ఉధృతిని గమనించారు. అనంతరం ఏవో రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.

'అంగన్‌వాడీలకు ఆయాలే దిక్కు'పై విచారణ

సాక్షి ఎఫెక్ట్

ప్రత్తిపాడు: మండలంలోని తుమ్మలపాలెం, కొండజాగర్లమూడి అంగన్‌వాడీ కేంద్రాల్లో మంగళవారం అంగన్‌వాడీ కార్యకర్తలు లేరని, కేంద్రాలకు ఆయాలకు వదిలేసి వెళ్లిపోయారంటూ బుధవారం 'సాక్షి'లో ప్రచురితమైన 'అంగన్‌వాడీలకు ఆయాలే దిక్కు' కథనంపై సీడీపీఓ వి.సుజాతదేవి విచారణ చేపట్టారు. ఆయా కేంద్రాల అంగన్‌వాడీ కార్యకర్తలతో మాట్లాడారు. కేంద్రాల్లో ఎందుకు లేరని ప్రశ్నించారు. వారి నుంచి లిఖితపూర్వక స్టేట్‌మెంట్లను తీసుకున్నారు. ఒక కార్యకర్త టాయిలెట్‌కు వెళ్లారని, మరో కార్యకర్త దశదిన కర్మ కార్యక్రమానికి సెక్టార్ సూపర్‌వైజర్ అనుమతి తీసుకుని వెళ్లినట్లు సీడీపీఓకు ఇచ్చిన వివరణలో పేర్కొన్నారు.

భూ సమస్యలు త్వరితగతిన పరిష్కారం

ప్రత్తిపాడు: రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన భూ సంబంధ సమస్యలకు త్వరితగతిన పరిష్కారం చూపడం జరుగుతుందని తహసీల్దార్ జి.కరుణకుమార్ అన్నారు. మండల పరిధిలోని ఈదులపాలెంలో బుధవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. వివిధ రకాల భూ సంబంధ సమస్యలకు సంబంధించి రైతుల నుంచి అందిన అర్జీలను అధికారులు స్వీకరించారు. కార్యక్రమంలో డీటీ ధర్మతేజ పాల్గొన్నారు.

గొట్టిపాడులో మహిళా వివక్షపై అవగాహన



ప్రత్తిపాడు: జెండర్ ఆధారిత వివక్షకు వ్యతిరేకంగా నిర్వహిస్తున్న జాతీయ ప్రచార కార్యక్రమంలో భాగంగా బుధవారం మండల పరిధిలోని పెదగొట్టిపాడు డీడబ్ల్యూ అంగన్‌వాడీ కేంద్రంలో మహిళలు, గ్రామస్తులు మహిళా వివక్షపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్త వి.ద్వారక, వీఓఏ పి.శిరీష మహిళా వివక్షపై గ్రామస్తులు, డ్వాక్రా మహిళలతో జెండర్‌తో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం వివక్షకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ర్యాలీ చేశారు. పురుషులతో సమానంగా మహిళలకు కూడా అన్ని రంగాల్లో సమాన హక్కులు కల్పించడం జరుగుతుందని కార్యకర్తలు మహిళలకు వివరించారు.

ఫార్మసీ విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్

వీసీ గంగాధరరావు



ఏఎన్‌యూ: ఫార్మసీ కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉందని వీసీ ఆచార్య కె.గంగాధరరావు అన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఫార్మసీ కళాశాలలో ఫార్మసీ కోర్సుల్లో నూతనంగా అడ్మిషన్ పొందిన విద్యార్థుల పరిచయ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వీసీ మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో బీ ఫార్మసీ ఎం.ఫార్మసీ వంటి కోర్సులు చేసిన విద్యార్థులకు మెండుగా ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. ప్రస్తుత ఆహారపు అలవాట్లలో విపరీతంగా మార్పులు వచ్చాయని దీని వల్ల ప్రజలు అనేక రకాల రోగాల బారిన పడుతున్నారని తెలిపారు. ఆహారపు అలవాట్ల నియంత్రణతో పాటు రోగాలను తగ్గించే ఔషధాలను తయారు చేసే బాధ్యత ఫార్మాసిస్టులపై ఉందన్నారు. ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ ఎ.ప్రమీలా రాణి మాట్లాడుతూ ఏఎన్‌యూ ఫార్మసీ కళాశాలకు ప్రత్యేక స్థానం ఉందని విద్యార్థులకు అన్ని వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. బాలికల వసతి గృహాల చీఫ్ వార్డెన్ డాక్టర్ మాధవి మాట్లాడుతూ బాలికల వసతి గృహంలో అన్ని రకాల మెరుగైన సేవలు అందిస్తున్నామని తెలిపారు.

ముగిసిన అర్బన్ ఎక్స్- 24 గంటల హ్యాకథాన్ పోటీలు



గుంటూరు రూరల్: ఫంక్షనల్ సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్‌ను సృష్టించడంలో విద్యార్థులకు హ్యాకథాన్ నూతన మార్గాన్ని చూపడమే కాకుండా నిర్దిష్ట సమయంలో తమ ముందున్న సవాళ్ళను అధిగమించడానికి దోహదపడుతుందని ఆర్‌వీఆర్ జేసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్ శ్రీనివాస్ తెలిపారు. బుధవారం చౌడవరంలోని ఆర్‌వీఆర్‌జేసీ కళాశాలలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న అర్బన్ ఎక్స్- 24 గంటల హ్యాకథాన్ రాష్ట్ర స్థాయి పోటీలు ముగిశాయి. పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన విజేతలు రూ.20,000,, సర్టిఫికెట్లను, రెండో స్థానంలో నిలిచి విజేతలు రూ.10 వేల బహుమతిని సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ మద్దినేని, కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ ఆర్.గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ కె. శ్రీనివాస్ మాట్లాడారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఏఓ డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, డాక్టర్ కె.చంద్రశేఖర్, డాక్టర్ పి.త్రిపుర పాల్గొన్నారు.

సుస్థిర అభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలి

చేబ్రోలు: సుస్థిర అభివృద్ధి లక్ష్యాల కోసం కృషి చేయాలని చేబ్రోలు ఎంపీడీఓ కే లలిత అన్నారు. చేబ్రోలు మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, మండల స్థాయి అధికారులు, సచివాలయం సిబ్బందికి సుస్థిర అభివృద్ధి లక్ష్యాల స్థానికీకరణపై నాలుగు రోజుల శిక్షణ కార్యక్రమంలో భాగంగా మూడో రోజు రెండో బ్యాచ్‌కు శిక్షణ బుధవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఎంపీడీఓ లలిత మాట్లాడుతూ సుస్థిరాభివృద్ధి కోసం 9 అంశాలతో గ్రామాల్లో ప్రభుత్వం నిర్దేశించిన 2030 నాటికి సుస్థిరాభివృద్ధి స్థానికరణ దిశగా గ్రామ అభివృద్ధి ప్రణాళికలు ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ టి.ఉషారాణి పాల్గొన్నారు.

యోగాసన స్పోర్ట్ చాంపియన్‌షిప్‌లో విజయలక్ష్మికి స్వర్ణపతకం

నగరంపాలెం: ఐదో సీనియర్ నేషనల్ యోగాసన స్పోర్ట్స్ చాంపియన్‌షిప్‌లో గుంటూరుకు చెందిన విజయలక్ష్మి స్వర్ణపతకం సాధించింది. కర్ణాటకలోని తుమకూరులోని మహాత్మాగాంధీ స్టేడియంలో ఈనెల 12-15వ తేదీ వరకు ఐదో సీనియర్ నేషనల్ యోగాసన స్పోర్ట్స్ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించారు. సీనియర్ మహిళల విభాగంలో(45-55 ఏళ్లు) ఆమె స్వర్ణపతకం సాధించారు. విజయలక్ష్మి యోగాను అభ్యసించడం, రాష్ట్రంలోని యోగ నిపుణుల నుంచి మార్గనిర్దేశం పొందడం గెలుపునకు ప్రత్యేకంగా నిలుస్తోంది. అమరావతి యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్, యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో గెలిచి జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించారు. గుంటూరులోని వైఎంకే యోగా సెంటర్‌లో తన నైపుణ్యాలను మెరుగుపరుచుకుంటూ ఈ జాతీయ స్థాయి ఛాంపియన్‌షిప్‌కి సిద్ధమయ్యారు. విజయలక్ష్మిని ఆంధ్రప్రదేశ్ యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ (వైఎస్‌ఏఏపి) అధ్యక్షురాలు డాక్టర్ ఎ.రాధిక, ప్రధాన కార్యదర్శి ప్రేమ్‌కుమార్ అభినందించారు.